పట్టాభిషేకం



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



పట్టాలు చూపిస్తున్న లబ్ధిదారులు

తూర్పులో అట్టహాసంగా 23,109 మందికి పట్టాల పంపిణీ

వచ్చే ఎన్నికల్లో అభివృద్ధికి ఓటేయండి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: తూర్పు నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా మాట్లాడా రు. నియోజకవర్గంలో 23,109 మందికి ఇళ్ల మంజూరయ్యాయని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో తూర్పు వాసుల సొంతింటి కల నెరవేరిందన్నారు. గతంలో ఏ ఒక్క నాయకుడు ఇచ్చిన హామీలకు అనుగుణంగా పని చేయలేదన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తామని డబ్బులు కట్టించుకొని మోసం చేస్తే.. ప్రస్తుత జగన్ సర్కారు రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఇల్లు కట్టుకోవడానికి సైతం పథకాల ద్వారా డబ్బులు అందిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం జగన్ గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజల అభివృద్ధికి నిస్వార్థమైన సేవలు అందిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికీ మేలు జరిగేలా వైఎస్ జగన్ పాలన సాగిందన్నారు. ఈ ఐదేళ్లలో ప్రతి ఇంటికి మేలు జరిగిందని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు తన మనస్సాక్షిని అడిగి ఎన్నికల్లో ఓటేయాలని కోరారు. తన ఇంట్లో మంచి జరిగిందనే భావిస్తేనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుది ధనికుల పక్షమని, వైఎస్ జగన్ మాత్రం ఈ ఐదేళ్లుగా పేదల పక్షాన నిలిచారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకపోతే నష్ట పోయేది పేదలు, మధ్యతరగతి ప్రజలేనని స్పష్టం చేశారు.



గీతాంజలి మృతికి మౌనం పాటిస్తున్న ఎంపీ ఎంవీవీ, పార్టీ నాయకులు

తూర్పులో ఏం 'వెలగ'బెట్టారు?

తూర్పు నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి.. ఈ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. తనను వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే తూర్పు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. అవినీతి రహిత పాలన అందించడంతో పాటు నియోజకవర్గాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు మాట్లాడుతూ కొంత కాలంగా తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ ఎంవీవీ చేస్తున్న కృషిని కొనియాడారు. గత నాలుగు నెలల్లో రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించా రు. దాదాపు రూ.4 కోట్లు సొంత నిధులతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జనసేన, టీడీపీ సోషల్ మీడియా వేధింపుల కారణంగా మరణించిన గీతాంజలికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. వార్డుల వారీగా లబ్ధిదారులకు ఎంపీ ఎంవీవీ ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, ఏపీడీ దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృపాజ్యోతి, ఎస్సీ విభాగం అధ్యక్షుడు శివరామకృష్ణ, కార్పొరేటర్లు ఉమ్మిడి స్వాతి, గేదెల లావణ్య, మువ్వల లక్ష్మి, అప్పారి శ్రీవిద్య, గుడ్ల సాయి, సత్యవతి, పలువురు వార్డు ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



పట్టాలు అందుకున్న ఆనందంలో మహిళలు

గతంలో దరఖాస్తు చేసుకున్నా.. ఫలితం లేదు..



నాకు పద్మనాభం మండలం అనంతరంలో ఇంటి స్థలం మంజూరైంది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చాలా సార్లు స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా ఎప్పుడు మంజూరు కాలేదు. కానీ ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇళ్ల స్థలం ఇచ్చినందుకు ఆనందంగా ఉంది. అంతే కాదు ఈ ప్రభుత్వంలో మాకు చాలా లబ్ధి జరిగింది. ఆరోగ్యశ్రీ ద్వారా మా అమ్మాయికి క్యాన్సర్ చికిత్స అందింది. నాకు పెన్షన్ కూడా వస్తుంది. మాలా అనేక కుటుంబాలకు జగన్ ప్రభుత్వ మేలు చేసింది. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిపొంది మరోసారి సీఎంగా జగనే వస్తారు.

– మాదాబత్తుల జ్యోతి, లబ్ధిదారు, కేఆర్ఎం కాలనీ, 23వ వార్డు

ఇల్లు కూడా కట్టుకుంటున్నాం..



నాకు పద్మనాభం మండలం మద్దిలో ఇంటి స్థలం వచ్చింది. ఇందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఇనాళ్లు అద్దె ఇంట్లో ఉంటున్నాం. ప్రస్తుతం అక్కడ ఇల్లు కూడా కట్టుకుంటున్నాం. సొంతింటి కల నెరవేరనున్నందుకు ఆనందంగా ఉంది. అంతే కాదు అమ్మఒడి, ఆరోగ్య శ్రీ పథకాల ద్వారా ఎంతో లబ్ధి పొందాం. పేద ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాం.

– కొప్పురవూరి శైలజ, లబ్ధిదారు, విజయనగర్ కాలనీ, 21వ వార్డు

టీడీపీలో అలకలు!

- 13వ వార్డులో రచ్చకెక్కిన నాయకులు
- నాలుగు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు విమర్శలు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో టీడీపీ నాయకుల మధ్య సఖ్యత కరువైంది. ఇక్కడ టీడీపీ నాయకులు ఒకరిపై మరొకరు బురద జల్లుకుంటున్నారు. ఈ వార్డులో టీడీపీ నాయకులు నాలుగు వర్గాలుగా విడిపోయారు. పార్టీ వార్డు అధ్యక్షుడు పాత్రకొండ ధర్మారావు, నాయకులు మజ్జి రమణి, తురకపూడి బాలస్వామి, నీలి అప్పలరాజు వేర్వేరుగా వర్గాలు నడుపుతున్నారు. ఏ వర్గానికీ సరైన ఆదరణ లేదు. వీరితో విసిగిపోయిన టీడీపీ కార్యకర్తలు ఎవరి వద్దకు వెళ్తే ఇంకొకరికి కోపం వస్తుందని భావించి వార్డులో ఏ కార్యక్రమాలు చేపట్టినా మాకెందుకులే అంటూ వెళ్లడం మానేస్తున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభావం పడుతుందేమో నని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి ఆందోళనలో పడ్డారు. రెండు రోజుల క్రితం ఆ నలుగురినీ నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయానికి ఎమ్మెల్యే వెలగపూడి పిలిపించుకుని చర్చలు జరిపారట. అయినా ఆ నలుగురూ ఒకరంటే మరొకరికి పడటంలేదు. 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో వార్డులో పాత్రకొండ ధర్మారావు, మజ్జి రమణి, నీలి అప్పలరాజు కార్పొరేటర్ టికెట్ కోసం పోటీ పడ్డారు. వారిలో ధర్మారావు కుమార్తెకు టీడీపీ టికెట్ ఇవ్వగా.. ఓడిపోయింది. దీంతో కార్పొరేషన్ ఎన్నికల్లో తన కుమార్తె విజయానికి సహకరించలేదని అందుకే ఓడిపోయామని మిగిలినవారి పట్ల ధర్మారావు అసంతృప్తితో ఉన్నారు. అప్పుడు మొదలైన అసంతృప్తి ఇప్పటికీ కొనసాగుతోంది. ఇది ఎంత వరకు వెళ్తుందోనని వెలగపూడి మదనపడుతున్నట్టు ఆ పార్టీ కార్యకర్తలు చెప్పుకుంటున్నారు.

హైవేపైకి జింకలు



రోడ్డు పక్కన జింక

ఆరిలోవ: జాతీయ రహదారి పక్కన జింకలు సందడి చేశాయి. కంబాల కొండల నుంచి వచ్చిన పలు చుక్కల జింకలు బుధవారం సాయంత్రం జూ పార్కు ఎదురుగా పచ్చిక, చెట్ల చిగుళ్లు మేస్తూ గుంపుగా తిరిగాయి. ఆ సమయంలో అటుగా ప్రయాణించే వాహన చోదకులు వాటిని ఆసక్తిగా తిలకించారు. వాహనాలు నిలిపి కొందరు వాటికి ఫొటోలు తీయడంతో బయంతో కొండపైకి పారిపోయాయి.

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబరుకు వాట్సాప్ చేయండి

97053 47483

నంబరును సంప్రదించండి

క్లుప్తంగా

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18,19 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. 18వ వార్డు అంజయ్యనగర్‌లో రూ.25 లక్షల ఎంపీ నిధులతో సామాజిక భవనానికి, 19వ వార్డులో రూ.25 లక్షలతో మత్స్యకారుల అవసరాలకు అనుగుణంగా షెడ్డు నిర్మాణం, అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తనకు ముఖ్యమన్నారు. మత్స్యకారులతో పాటు అనేక ప్రాంతాల్లోని మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జాలరిపేటలో ఎంవీవీ సహపంక్తి భోజనం



సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ బుధవారం 19వ వార్డు జాలరిపేటను సందర్శించారు. గడపగడపకు వెళ్లి స్థానికంగా ఉన్న సమస్యలపై పలువురు గ్రామస్తులతో మాట్లాడారు. వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభు త్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం వాడమోదుల బంగారి ఇంట్లో గ్రామ పెద్దలు, పార్టీ శ్రేణులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

10వ వార్డులో మరింత అభివృద్ధికి కృషి



రవీంద్రనగర్ శివాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డులో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. వార్డు పరిధి రవీంద్రనగర్ శివాలయం ఆవరణలో విశ్వకర్మ సేవా సంఘం ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ ఎంవీవీ ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. వార్డులో మరింత అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకట స్వామి, విశ్వకర్మ సంఘం సభ్యులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ బహిరంగ సభ వాయిదా

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 15న నిర్వహించాల్సిన బహిరంగ సభ వాయిదా పడింది. ఉక్కునగరం త్రిష్టా మైదానంలో నిర్వహించాల్సిన ఈ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల హాజరు కావాల్సి ఉంది. తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు సభను మర్నాడుకు వాయిదా వేశారు. 16న అదే మైదానంలో నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళల ఆరోగ్యమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం

- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి
- ప్రత్యేక శిబిరంలో 375 మందికి వైద్య పరీక్షలు



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు



ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న మేయర్ గొలగాని, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ

ఆరిలోవ: మహిళల ఆరోగ్యమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం గురజాడ కళా క్షేత్రంలో వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కిమ్స్, మెడికవర్ సంయుక్తంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 375 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తమ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎంపీ, పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని అందుబాటులో ఉండేలా వార్డుల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా నైట్ షెల్టర్లు అయిన టీఎస్సార్ కాంప్లెక్స్, భూపేష్‌నగర్, పెదవాల్తేరులో రెడ్‌క్రాస్ సొసైటీకి మూడు వాటర్ ఫిల్టర్లు అందజేశారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు వైవీవి సుబ్బారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియాని శ్రీధర్, కట్టమూరి సతీష్, పార్టీ ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల సమన్వయకర్తలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్, మెప్మా ఎండీ విజయలక్ష్మి, జీవీఎంసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ పాపు నాయుడు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.



స్థానికులతో పాటు విదేశీ విద్యార్థినుల సందడి



కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

భారతీయ సంస్కృతి విశిష్టమైనది

ఏయూ క్యాంపస్: భారతీయ సంస్కృతి ఎంతో విశిష్టమైనదని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎత్నిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా విద్యార్థులతో కలిసి వీసీ కేక్ కట్ చేసి బెలూన్లను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైవిధ్యమైన భాషలు, వస్త్రధారణ, జీవన విధానాలు కలిగి ఉన్న సుందరమైన దేశంగా భారత్ నిలుస్తుందన్నారు. దేశ ప్రజలందరినీ ఐక్యం చేసినది మన సంస్కృతేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో విదేశీ విద్యార్థులు సైతం సంప్రదాయ దుస్తుల్లో హాజరు కావడం మంచి పరిణామమన్నారు. యువత తమ సామర్థ్యాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు

విశాఖ నుంచి కేఏ పాల్‌ను పార్లమెంట్‌కు పంపుదాం

- సినీ నటుడు బాబూమోహన్



మీడియాతో మాట్లాడుతున్న బాబూమోహన్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం నుంచి కేఏ పాల్‌ను పార్లమెంట్‌కు పంపి.. జిల్లా, రాష్ట్ర, దేశ సమస్యలపై ప్రశ్నించే అవకాశం కల్పిద్దామని మాజీ ఎమ్మెల్యే, సినీ నటుడు బాబూమోహన్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేఏ పాల్, ఆయన అన్న డేవిడ్‌రాజులతో తనకు 30 ఏళ్ల నుంచి అనుబంధం ఉందని, ఈ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ తరఫున ప్రచారం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తనను కాకినాడ లేదా గాజువాకల నుంచి పోటీ చేయమని కేఏ పాల్ కోరారని, తాను అందుకు సిద్ధంగా లేనని తెలియజేశానన్నారు. బీజేపీ తనను మోసం చేసిందని, ఆ ఘటనతో ఇక ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాకూడదని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. కేఏ పాల్‌కు ప్రపంచ దేశాధినేతలతో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ మధ్య కాలంలో స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే పరిస్థితి వస్తే తాను కొంటానని కూడా ఆయన అన్నారని బాబూమోహన్ గుర్తుచేశారు. త్వరలోనే పార్టీ విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక పూర్తవుతుందని, ఇది ప్రారంభం మాత్రమేనన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తు ఎన్నాళ్ల నుంచో నడుస్తోందని, ఇప్పుడది బహిర్గతమైందని చెప్పారు.

పోర్టులో ఘనంగా మహిళా దినోత్సవం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం పోర్టు సాంబమూర్తి ఏసీ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, వీసెజ్ జేడీసీ రోషిని అపరంజి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోర్టులో ఆధునికీకరించిన సాంబమూర్తి ఆడిటోరియాన్ని డా.అంగముత్తు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోర్టులో చక్కని పని వాతావరణం కల్పించడంలో మహిళా ఉద్యోగులు అవిరళంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. భవిష్యత్తులో పోర్టులో మహిళా ఉద్యోగుల సంఖ్య మరింత పెరగాలని చైర్మన్ ఆకాంక్షించారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న ఉద్యోగినులను చైర్మన్ సత్కరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా పోర్టులో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన ఉద్యోగినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పీసీఎల్ స్వామి, సెక్రటరీ వేణుగోపాల్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మద్దిలపాలెం : చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని అంగన్‌వాడీ కార్యకర్త ఈర్ల దేవి తెలిపారు. అంబేడ్కర్ కాలనీ-2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిల్లెట్ పోకస్డ్ కమ్యూనిటీ బెస్ట్ ఈవెంట్ పేరిట పోషకాహార విలువల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, కౌమారదశలో ఉన్న బాలికలకు చిరుధాన్యాలు, వాటి ప్రాముఖ్యతపై అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజ, ఆశా చినతల్లి, ఎం.మంగ, అంగన్‌వాడీ సహాయకురాలు పి.కనకదుర్గ పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ డీవో ఆత్మహత్య



సీవీ గణపతిరావు (ఫైల్)

తగరపువలస: భీమిలి బ్యాంక్ కాలనీకి చెందిన ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ చావలి వెంకట గణపతిరావు బుధవారం ఇంటి వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అతన్ని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. అతనికి భార్య శ్రీదేవి, బీటెక్ పూర్తి చేసిన కుమారుడు భరద్వాజ్ ఉన్నారు. ఉదయం ఇంటి వద్ద నుంచే ఎల్‌ఐసీ ఏజెంట్లతో మాట్లాడిన గణపతిరావు అంతలోనే ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు తెలియరాలేదు. ఇటీవల గుండెపోటుకు గురైన గణపతిరావు వెంటనే చికిత్స చేయించుకున్నారు. ఇంటి ఆవరణలో మొక్కలకు వినియోగించే పురుగు మందు తాగినట్టు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి.. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూ సమాచారం..

క్రమశిక్షణ ప్రగతికి మార్గం



విద్యార్థుల నృత్య ప్రదర్శన



సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ఎం. జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: కష్టించే తత్వం కలిగి ఉంటే ప్రగతికి మార్గం సుగమం అవుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచాన్ని కలిపే శక్తి కమ్యూనికేషన్ వ్యవస్థకు ఉందన్నారు. ఈ రంగంలో నిపుణుల ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. దీనికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లక్ష్యాలను స్థిరపరుచుకోవడం, నిత్య వాటిని సాధించే దిశగా చేసే ప్రతీ చిరు ప్రయత్నం భవిష్యత్తులో ఉన్నత విజయాన్ని అందిస్తుందన్నారు. ఎదురైన సందర్భంలో సమయస్ఫూర్తి, నిజాయితీ కలిగి పని చేస్తే విజయం సాధించడం సాధ్యపడుతుందన్నారు. సదస్సు సంచికను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ, ప్రగతి తమకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఎస్.అరుణ, ఆచార్య పి.వి.శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

పెండింగ్ ఫారాలు పరిష్కరిస్తాం

- కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎటువంటి పెండింగ్ ఫారాలు లేకుండా తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ మల్లికార్జున రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. ఎన్నికల నియమావళి తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బుధవారం కలెక్టర్లు, ఎస్పీలతో విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి ఎటువంటి ఫారాలు పెండింగ్‌లో ఉండకూడదని, ఆ రోజు నుంచి ఎటువంటి చేరికలు, తొలగింపులు చేయవద్దని కలెక్టర్లకు సీఈవో స్పష్టం చేశారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో 20,635 వరకు ఫారం 6, 7, 8లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఐదు లక్షల ఎపిక్ కార్డులకు గానూ 4.8 లక్షల కార్డులు జిల్లాకు చేరాయన్నారు. ఏడు ఫిర్యాదులకు ఐదు పరిష్కరించామని వివరించారు.